



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

'జనహిత యాత్ర'ను సక్సెస్ చేయాలి..

- రేపు వర్ధన్నపేట నియోజకవర్గంలో నిర్వహణ
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాక
- నిరంతరం ప్రజల్లో ఉండాలన్నదే రాహుల్ అభిమతం
- ఉమ్మడి జిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హనుమకొండ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే జనహిత పాదయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ అడ్లూరి లక్ష్మణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ యాత్రలో మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. 25న పాదయాత్రలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. యాత్ర నేపథ్యంలో మంత్రి లక్ష్మణ్ శనివారం హనుమకొండకు వచ్చారు. డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జనహిత పాదయాత్ర సన్నద్ధసమావేశం జరిగింది. సమావేశం ఆరంభానికి ముందుగా సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు నాగరాజు, యశస్వినిరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జనహిత పాదయాత్ర రాష్ట్ర ఇన్‌చార్జ్, రామగుండం ఎమ్మెల్యే మకన్‌సింగ్ ఠాగూర్ తదితర ముఖ్య నేతలతో మంత్రి లక్ష్మణ్ సమావేశం అయ్యారు. జనహిత పాదయాత్ర అంశాలను సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి లక్ష్మణ్ యాత్ర వివరాలను వెల్లడించారు. 25న వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఇల్లంద మార్కెట్‌కు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి వర్ధన్నపేట అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు మరింత చేరువ చేసే ప్రణాళికతోనే కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత

(మిగతా 8వ పేజీలో)

> **పార్టీ చెప్పినా ఎందుకిలా చేస్తున్నారో..!**
>
> భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎ‌స్‌లో ఎలాంటి గందరగోళం లేదు. పార్టీ నాయకత్వం కూడా నాకే నియోజకవర్గ బాధ్యతలను అప్పగించింది. దీనిపై కేసీఆర్‌తో పాటు ఇటీవల కేటీఆర్ కూడా స్పష్టత ఇచ్చారు. పార్టీ పరంగా మధుసూదనాచారికి అధినాయకత్వం అన్ని రకాలుగా సముచిత స్థానం కల్పించింది. అయినా ఇలా ఎందుకు పార్టీలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారో అర్థం కావడం లేదు.
>
> - గండ్ర వెంకటరమణారెడ్డి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే
>
> **నియోజకవర్గంతో నాది విడదీయని అనుబంధం**
>
> భూపాలపల్లి నియోజకవర్గం నుంచి గెలిచే గతంలో శాసనసభ స్పీకర్‌గా పనిచేశా. ఈ నియోజకవర్గంతో, ఇక్కడి ప్రజలతో నాకు విడదీయరాని అనుబంధం ఉంది. ఇకపైన కూడా ఉంటుంది. నియోజకవర్గంలో బీసీ జనాభా అధికంగా ఉంది. బీసీల మద్దతు కూడా బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో ఉపయోగపడుతుంది. ఎవరేం చెప్పినా నియోజకవర్గంతో నా అనుబంధాన్ని విడదీయలేరు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ గెలిచి కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం.
>
> - సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత



బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు

- గండ్ర, సిరికొండ వర్గాలుగా చీలిపోయిన శ్రేణులు
- వచ్చే ఎన్నికల టికెట్‌పైనే ఇద్దరు నేతల గురి
- వెంకటరమణారెడ్డికే పార్టీ పగ్గాలంటూ ఇటీవల కేటీఆర్ స్పష్టత
- ప్రకటనను పట్టించుకోకుండా మాజీ స్పీకర్ పర్యటనలు
- నియోజకవర్గంతో అనుబంధం ఉంటుందంటూ పరోక్షంగా ధిక్కార సంకేతం!
- మూడు రోజులుగా భూపాలపల్లిలోనే మకాం

భూపాలపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి నియోజకవర్గ భారత రాష్ట్ర సమితిలో వర్గ పోరుకు ఇప్పుడప్పుడే తెరపడే సూచనలు కనిపించడం లేదు. నియోజకవర్గం నుంచి గతంలో ప్రాతినిధ్యం వహించిన శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, తాజా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మధ్య ఆధిపత్య పోరుకు తెరలేవడంతో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కూడా రెండు వర్గాలుగా చీలిపోయాయి. ఫలితంగా స్థానిక సంస్థల ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చోటు చేసుకుంటున్న ఈ పరిణామాలు పార్టీ విజ యా వకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. పార్టీ ఓడిపోయిన నియోజకవ ర్గాల్లో తాజా మాజీలే ఇన్‌చార్జులుగా వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోందని గండ్ర శిబిరం వాదిస్తుండగా, ఈ నియోజకవర్గంతో సిరికొండ మధుసూ దనాచారికి ప్రత్యేకమైన అనుబంధం ఉందని, పార్టీకి మొదటి నుంచి ఇక్కడ ఆయన పెద్దదిక్కుగా ఉన్నారని ఆయన వర్గీయులు వాదిస్తున్నారు. ఈ గొడవలు ఇలా జరుగుతున్న క్రమంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఈ వివాదంపై స్పష్టతనిచ్చారు. ఆరు నూరైనా వచ్చే ఎన్నికలు గండ్ర నాయకత్వంలోనే ఇక్కడ జరుగుతాయని స్పష్టం చేశారు. అంతేకాదు మధుసూదనాచారికి పార్టీ పరంగా ఇప్పటి వరకు ఇవ్వాల్సిన అన్ని పదవులు, మర్యాదలు కేసీఆర్ ఇచ్చారని ప్రకటించి గ్రూపుల గొడవకు తెరదించే ప్రయత్నం చేశారు. అయితే.. ఆయన పర్యటించి వెళ్లిన నాలుగు రోజులకే సిరికొండ మధుసూదనాచారి భూపాలపల్లికి చేరుకొని మూడు రోజులపాటు ఇక్కడే మకాం వేసి పట్టణంలోని ముఖ్య కార్యకర్తలు, ప్రముఖులను కలుస్తూ సందడి చేయడం కొత్త చర్చకు దారి తీసింది. అంతేకాదు పాత్రికేయుల సమావేశ ంలోనూ తన పర్యటనల గూర్చి వ్యూహాత్మకంగా తాను ఇక్కడే ఉండబోతున్నట్లు సంకేతాలు ఇవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత ను సంతరించుకుంది. ఇటీవల కేటీఆర్ చేసిన ప్రకటనను పాత్రికేయులు ప్రస్తావిస్తే.. తనకు నియోజకవర్గంతో విడదీయరాని అనుబంధం ఉందని, ఇకపై కూడా ఉంటుందని చెప్పి మాట దాటివేశారు. దీన్నిబట్టి పరోక్షంగా కేటీఆర్ నిర్ణయంపై ధిక్కారం ప్రదర్శించారని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా సిరికొండ మధుసూ దనాచారి వచ్చే శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే తన వర్గాన్ని పటిష్టం చేసుకునే దిశగా పావులు కదుపుతున్నారన్న అభిప్రాయా లు వ్యక్తమవుతున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ నిర్ణయం ఎలా ఉన్నా భూపాలపల్లి నుంచే బరిలోకి దిగాలన్న పట్టుదలతో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలో మంజూరునగర్ సమీపంలో ప్రత్యేకంగా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన సిరికొండ అక్కడి నుంచి నియోజకవర్గంలో పట్టు సాధించే ందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారని తెలుస్తోంది. మొత్తానికి కేటీఆర్ ప్రకటనతో సమస్య సమసిపోయిందని అంతా అనుకున్నా తాజాగా సిరికొం డ పర్యటనతో అది ఇంకా నిప్పులా రాజుకుంటూనే ఉందన్న విషయం తేటతెల్లమైంది.

13న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు

కృష్ణకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. హెచ్. రమేష్‌బాబు తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలన్నారు. క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా, మోటార్ యాక్సిడెంట్స్ చెక్ బౌన్స్ కేసులు రాజీపడేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.నాగరాజ్, జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఆర్.దిలీప్‌కుమార్, జిల్లా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, కాటారం డీఎస్పీ సూర్య నారాయణ, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

అన్నారంలో అగ్నిప్రమాదం



మహదేవపూర్ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంతో ఓ ఇల్లు కాలి బూడిదైన సంఘటన మండలంలోని అన్నారం గ్రామంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రత్న మల్లక్క, ఆమె భర్త అన్నారం గ్రామంలోని ఓ ఇంట్లో నివసి స్తున్నారు. ఇద్దరూ వ్యక్తిగత పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఇదే క్రమంలో వారు ఉంటున్న ఇంటి నుంచి పొగలు వస్తున్నాయని తెలుసుకొని హటాహుటినా అక్కడి నుంచి బయల్దేరారు. వారు చేరుకొనేలోపే వివరాల ప్రకారం.. ఇంటికి చేరుకొనేలోపే సర్వం కాలిబూడిదైంది. రూ.50 వేల నగదుతోపాటు విలువైన సామగ్రి దగ్ధమైందని బాధితురాలు రత్న మల్లక్క తెలిపింది. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని భావిస్తున్నామని చెప్పింది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ రామారావు, ఎంపీడీవో రవీంద్రనాథ్ పరిశీ లించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని తెలిపారు. వీరితో పాటు ఘటన స్థలాన్ని మాజీ ఎంపీటీసీ దుర్గయ్య, మాజీ సర్పంచ్ రమాదేవి పరిశీలించి బాధితురాలిని పరామర్శించారు.

బావిలో పడి ఒకరి మృతి



లక్ష్మీరాజం (ఫైల్)

రేగొండ, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామానికి చెందిన కుంట్ల లక్ష్మీరాజం(50) శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. శనివారం ఉదయం గ్రామ పరిధిలో ఉన్న వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనిపించడంతో అనుమానంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో కొండ్లు వేసి బావిలో గాలించగా మృతదేహం బయటపడింది. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ పేర్కొన్నారు.

తాగునీటిలో గడ్డిమందు

- భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడి నిర్వాకం
- ఆ నీటిని తాగిన 11 మంది విద్యార్థులకు అస్వస్థత
- ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు కుట్ర జరిగినట్టు విచారణలో వెల్లడి
- ఎమ్మెల్యే ఎదుట తమ గోడు వినిపించిన విద్యార్థులు
- విధుల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, వంట కార్మికురాలిని తొలగించిన కలెక్టర్

8





విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, టానిక్‌బాటిల్‌లో పోసి ఉంచిన గడ్డి మందు

పనుల జాతరతో పల్లెల అభివృద్ధి

- గ్రామాలన్నింటికీ సీసీ రోడ్ల మంజూరు
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



బందారుపల్లిలో అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఇందులో భాగంగానే పనుల జాతరకు శ్రీకారం చుట్టి నట్టు తెలిపారు. జిల్లాలో ఆమె శనివారం పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పనుల జాతరలో భాగంగా పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మునిసిపాలిటీ పరిధిలోని బండారుపల్లి ఎస్సీకాలనీలో రూ. 29 లక్షల నిధులతో ఆరు పనులు, జాకారం ఎస్సీకాలనీలో రూ.58.50 లక్షల నిధులతో 11 పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల కోసం రూ. 30 లక్షలతో సమకూర్చిన మినీ బస్సును ప్రారంభించారు. జేడీ మల్లంపల్లి మండలంలోని శ్రీనగర్‌లో రూ.20 లక్షల నిధులతో గ్రామ పంచాయతీ భవనం, రూ. 92 వేలతో సోక్‌పిట్, మల్లంపల్లి ఎస్సీకాలనీలో రూ.61 లక్షలతో 14 పనులకు, మహ్మద్‌గౌస్‌పల్లి రూ. 60.50 లక్షల నిధులతో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల నిధులతో నిర్మించిన డ్రెయినేజీ కల్వర్టును ప్రారంభించారు. రూ.15 లక్షలతో జేడీ మల్లంపల్లి మండల కేంద్రంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ ప్రారంభోత్సవం చేశారు.

అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ మారుమూల గ్రా మీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రధాన రహదారులను విస్తరిస్తున్నామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రానున్న రోజుల్లో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థిక స్వావ లంబన సాధించాలన్నారు. వడ్డీలేని రుణాలతోపాటు బ్యాంకు రుణాలు పొంది స్వయంగా వ్యాపారాలను ప్రారంభించాల న్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలతో పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మల్లంపల్లి గ్రామాన్ని జేడీ మల్లంపల్లి మండలంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 100 రోజుల ఈజీఎస్ పనులు పూర్తి చేసిన కూలీలను మంత్రి సీతక్క సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, మునిసిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్, జిల్లా పంచాయతీ అధికారి దేవ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంలో రాజీపడేది లేదు..

కలెక్టర్ రాహుల్‌శర్మ



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమ విషయంలో రాజీపడేదిలేదని, సిబ్బంది విబేధాలతో వారిని ఇబ్బందిపెడితే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌శర్మ హెచ్చరించారు. సంక్షేమ వసతి గృహాల్లో ఆహారం, తాగునీటి సౌకర్యాలు తదితర అంశాలపై క్లస్టర్ అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కేజీబీవీ అధికారులు, జిల్లా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్ హెచ్ఎంలతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. నాణ్యమైన భోజనం, విద్యను అందిస్తుంటే ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయం లోపంతో విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముందు హెచ్చరికలు ఉండవని, సస్పెండ్ చేయడమే ఉంటుందని హెచ్చరించారు. సిబ్బంది నిర్లక్ష్యం సహించేదిలేదన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం నూతన ఆహార మెనూను అందుబాటులోకి తెచ్చిందన్నారు. సోమవారం నుంచి అధికారులు ప్రతి హాస్టల్‌నూ తనిఖీ చేయాలన్నారు. హాస్టల్స్‌లోని వంటగదులు, సామాను భద్రపరిచే గదులు, కూరగాయాలను నిశితంగా పరిశీలించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విజయసారథి


అజయ్‌సారథిరెడ్డి


సుధాకర్‌రెడ్డి


శ్రీనివాస్

సీపీఐ రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విజయసారథి

● కౌన్సిల్ సభ్యులుగా ముగ్గురికి అవకాశం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కమిటీలో మానుకోటకు ప్రాధాన్యత లభించింది. జిల్లా నుంచి నలుగురికి చోట దక్కగా అందులో ఒక్కరికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా,ముగ్గురికి కౌన్సిల్ సభ్యులుగా అవకాశం దక్కింది. మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో జరిగిన సీపీఐ రాష్ట్ర నాలుగవ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో మానుకోట పట్టణానికి చెందిన జిల్లా కార్యదర్శి బి.విజయసారథి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, పట్టణానికి చెందిన జిల్లా సహాయ కార్యదర్శి, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, కురవి మండలం అయ్యగారిపల్లికి చెందిన జిల్లా సహాయ కార్యదర్శి, డోర్నకల్ నియోజకవర్గ ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, గార్ల మాజీ వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నైపుణ్యాన్ని పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు

కార్మిక శాఖ వరంగల్ జోన్ జాయింట్ కమిషనర్ రాజేంద్రప్రసాద్

కాటారం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం, టాటా గ్రూపుతో కలిసి చేప ట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అందించే అత్యాధునిక కోర్సులతో నైపుణ్యాభివృద్ధి పెంచుకుంటే ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడి ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని కార్మిక శాఖ వరంగల్ జోన్ జాయింట్ కమిషనర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జిల్లాలోని ఏటీసీల్లో ప్రవేశాల కోసం ఏటీసీల ప్రిన్సిపాల్స్, సిబ్బందితో కలిసి కార్మికశాఖ ఆధ్వర్యంలో పలు ఎన్‌జీ వోలు, స్వయం సహాయక సంఘాల కమిటీల ప్రతినిధులలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో భూపాలపల్లి, కాటారం ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) త్వరలో ప్రారంభమై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభ్యర్థులకు మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్, అర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్ సీఎన్సీ మేషనింగ్ టెక్నిషియన్, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికల్ అనే ఆరు అంశాల్లో శిక్షణ అందిస్తాయని వెల్లడించారు.

పదో తరగతి పూర్తి చేసిన వారెవరైనా ఈ కోర్సులకు ఈ నెల 28 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి లేబర్ ఆఫీసర్ వినోద, భూపాలపల్లి కాటారం ఐటీఐ ప్రిన్సిపాల్స్ జుమ్లానాయక్, గోలి తిరుపతి, ఏపీఎం రవీందర్, టీవోలు, ఏటీవోలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వరంగల్ జోన్ జేసీఎల్ రాజేంద్రప్రసాద్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడ్వాయి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతడి కూతురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వెంగళాపూర్ శివారులో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెంగళాపూర్ గ్రామానికి చెందిన అల్లెం సురేష్(40) తన చిన్న కుమార్తె లాస్యశ్రీ అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం గోవిందరావుపేట మండలం పస్రాకు ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో అదే గ్రామ శివారులో ఆగి ఉన్న వ్యవసాయ కూలీల ట్రాక్టర్ ట్రాలీకి వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తండ్రి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే సురేష్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఝాన్సీ, లాస్యశ్రీతోపాటు మరో కూతురు నిస్య శ్రీ ఉన్నారు.


సురేష్ (ఫైల్)


సమావేశంలో మాట్లాడుతున్న పృథ్వీ

విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలపై పోరాటం

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలు కొనసాగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో తీసుకువస్తున్న విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, శాస్త్రీయ విద్యసమానత్వ సమాజ స్థాపనే ధ్యేయంగా భవిష్యత్ ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

దేశంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించకుండా ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ చేయకపోవడంతో నాణ్యమైన పరిశోధనలు జరగక విశ్వవిద్యాలయాలన్ని సంక్షోభంలో కూరుకుపోతున్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.8,600 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా పేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేయాలన్నారు. ఈ సమావేశంలో నరసింహరావు, ఉదయ్, శ్రావణ్, ఓంకార్, ప్రవీణ్, జశ్వంత్, రాంచరణ్, కార్తీక్, రోహిత్, ప్రణీత్, శ్రీకర్, గౌతమ్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను వినియోగించుకోవాలి

● జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి షాలిని

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి షాలిని అన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. లీగల్ ఏయిడ్ క్లీనిక్‌లో మత్తు పదార్థాలు, డ్రగ్స్ గంజాయి, ఆల్కాహాలు వంటివాటికి అలువాటు పడిన వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇచ్చి సాధారణ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసనం ఒక తీవ్రమైన సమస్య అని, పరిష్కారం కోసం అడిక్షన్ సెంటర్ల సహాయం తీసుకోవడం మంచిదన్నారు. వ్యసనాలకు అలువాటు పడే వారిని వైద్యపరమైన ప్రక్రియలతో మత్తు పదార్థాల వాడకాన్ని నివారించవచ్చన్నారు. న్యాయ సేవాధికార సంస్థ, వైద్యశాఖ సమన్వయంతో బాధితులకు అన్నివిధాల సహకారం అందుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి ఆర్ఎం జగదీష్ మాట్లాడుతూ వ్యవసనాలకు బానిసైన వారు శరీరాన్ని సురక్షితంగా బయటపడేందుకు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలన్నారు. యువత మత్తు, వ్యసనాలకు దూరంగా ఉండి వ్యక్తిత్వ నైపుణాలతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి షాలిని

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

● డీఈవోకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ వినతి

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మధ్యాహ్న భోజన కార్మికుల నిధుల దుర్వినియోగంపై ఆర్డీవో స్థాయి అధికారితో విచారణ చేపట్టాలని జాతీయ మానవ హక్కుల మండలి ఉత్తర తెలంగాణ చైర్మన్ కొరిపెల్లి ప్రశాంత్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా చైర్మన్ భూక్య సురేష్ నాయక్‌తో కలిసి డీఈవో రాజేందర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు 2018 నుంచి 2025 వరకు పీఎఫ్ఎంఎస్ ద్వారా మంజూరైన నిధులు, వినియోగంతో పాటు డిజిటలైజేషన్‌లో భాగంగా వచ్చిన ఆధార్ కిట్లు, ప్రింటర్లు, స్టాక్ రిజిస్టర్ల వారీగా వివరాలు తెలపాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల జాబితా, వారికి చెల్లిస్తున్న భృతి వివరాలు, మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది అర్హతలు, వారిని ఏ ప్రాతిపదికన నియమించారో తెలుపాలని పేర్కొన్నారు. వీరి వెంట ప్రతినిధులు నరేష్, రాజయ్య, గుండు బాజీ, శంకర్, సుంకె మధూకర్, బాబురావు, రాజు పాల్గొన్నారు.


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జరిగిన అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి విమర్శించారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆమె ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి గొప్పలు చెప్పుకోవడంతోనే సరిపోతుందని అన్నారు. అనంతరం కొర్కిశాల కేజీబీవీని ఆమె సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శైలజతోపాటు మరికొంతమంది ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రిన్సిపాల్‌పై కీర్తిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వచ్ఛమైన తాగునీరు అందించకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి,నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు శేషగిరి, అరికాంతపు కృష్ణారెడ్డి, బల్గూరి కిషన్‌రావు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కీర్తిరెడ్డి, నాయకులు

మేడిగడ్డ బ్యారేజీలోకి 5.25 లక్షల క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 5.25 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.30 మీటర్లు నమోదైంది.


సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

హామీలన్నింటినీ కాంగ్రెస్ నెరవేర్చాలి

కృష్ణకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడారు. అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఏ ఒక్కటినీ అమలు చేయడం లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో జాగృతి సంస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. జాగృతి ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు అలువల జితేందర్, రవి రాథోడ్, జిల్లా జాగృతి నేతలు నరేష్ నేత, అమ్మ అశోక్, అంతటి రాము, రాజశేఖర్, వంశీ, సందీప్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

● జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా రెగ్యులర్‌గా వస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల తెలిపారు. శనివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 21042 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయడం జరిగిందని, గతేడాదితో పోలిస్తే 200 మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా జిల్లాకు వచ్చిందని ఆమె తెలిపారు. యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు, కాగా, యూరియాను అతిగా వినియోగించి పంట నష్టపోవద్దని మహబూబాబాద్ సహాయ సంచాలకులు శ్రీనివాస్‌రావు రైతులకు సూచించారు.

ఈ నెల 24న ఇఫ్‌కో కంపెనీ నుంచి 112 మెట్రిక్ టన్నుల యూరియా అలాట్ చేయడం జరిగిందని, ఇందులో 88 మెట్రిక్ టన్నులకు ప్రైవేట్ డీలర్లకు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాకు వచ్చిన ప్రతి ఎరువులను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం పొందిన తర్వాత రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అవసరానికి మించి యూరియాను కొనుగో లు చే యొద్దని, నానో యూరియాను వాడుకోవాలన్నారు. యూరియా అధికంగా ఎక్కువ మోతాదులో వాడడంతో పంటకు పురుగుల ఉధృతి, రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

భీమునిపాదానికి రాకపోకల పునరుద్ధరణ

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతాన్ని పర్యాటకులు వీక్షించేందుకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ జోక్యంతో రాకపోకలను శనివారం పునరుద్ధరించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల పాటు జిల్లాలోని జలపాతాళ సందర్శనను నిలిపివేశారు. రెండ్రోజుల క్రితం గూడూరు రేంజ్ అధికారి సురేష్ భీమునిపాదం జలపాతానికి పర్యాటకులను పునరుద్ధరించిన విషయం తెలిసిందే.

కానీ గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి మాత్రం పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల అందలేదని జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతించలేదు. పోలీస్ సిబ్బందిని సైతం అక్కడ ఏర్పాటు చేసి సందర్శకులను వెళ్లనివ్వలేదు. దీంతో జిల్లా అటవీశాఖ అధికారి విశాల్ బత్తుల జరిగిన విషయాన్ని ఎస్పీకి వివరించారు. ఎస్పీ జోక్యంతో గూడూరు పోలీసులు భీమునిపాదంలో వరద ఉధృతి తగ్గడంతో ఎస్పీ ఆదేశాల మేరకు తిరిగి పర్యాటకుల సందర్శనకు అనుమతి ఇచ్చారు.

కారులో కత్తులతో విహారం

● యువకుడిపై దాడికి యత్నం

● వైరల్ అవుతున్న వీడియో కలకలం

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బ్లూ కలర్ కారులో వచ్చిన కొందరు వ్యక్తులు కత్తులను తిప్పుతూ, యువకుడిపై దాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా శనివారం వెలుగుచూసింది. యువకుడిపై దాడియత్నం సమయంలో కొందరు గుమ్ముడూరు వాసులు అతన్ని రక్షించి కారులో ఉన్నవారిపై తిరగబడడంతో డ్రైవర్, మరికొందరు పరారయ్యారు. ఒక్కరు మాత్రం చిక్కడంతో అతన్ని నిలదీస్తూ కత్తిని కూడా చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేయడం కలకలం రేపుతోంది. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం గుమ్ముడూరు ప్రాంతంలో జరిగినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై టౌన్ సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఓ మహిళ విషయమై ఇరువురు వ్యక్తుల మధ్య వివాదానికి కారణమని చెప్పారు. వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తితో పాటు కారుడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు.


కారులో సీటుపై ఉన్న కత్తి

రామప్పను సందర్శించిన విదేశీయులు


రామప్ప దేవాలయం ఆవరణలో విదేశీయులు

వెంకటాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని హైదరాబాద్‌లోని ఎంసీ ఆర్ హెచ్‌ఆర్‌డీ ఐటీలో శిక్షణ పొందుతున్న విజ్, రష్యా, వియత్నాం, లెబనాన్, నేపాల్, శ్రీలంక, కొటెడివోయిర్, జింబాబ్వే, నైజీరియా, ఇథియోపియా, సౌత్‌సూడాన్, ఉగాండ, టాంజానియా, రువాండ, జాంబియా, సెనెగల్, లైబీరియా, ఘనా, సియెర్రా, లియోన్, లెసోతో, జమైకా, పనామా, ఈక్వెడార్, జోర్డన్, తదితర దేశాలకు చెందిన 30 మంది శనివారం సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ఉమాశంకర్, హరీష్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి తూర్పున ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను తిలకించారు. వారి వెంట ఎంసీ ఆర్ హెచ్‌ఆర్‌డీ ఐటీ అధికారులు నందకిషోర్, రవిబార్గవి, సాయికిషోర్, గౌతమ్, తహసీల్దార్ గిరిబాబు, ఆర్ఐ విజేందర్, ట్రెయినీ ఎస్సై సాంబారావు ఉన్నారు.

దేవుడు వరమిచ్చినా..

కొందరు పీఏసీఎస్ చైర్మన్లలో గుబులు

- అన్ని సొసైటీలకు గడువు పొడిగింపు ఇవ్వని సర్కారు
- నష్టాలు, అక్రమాలుంటే చైర్మన్‌కు నో చాన్స్
- నాలుగు రోజులుగా సొసైటీల్లో ఆడిట్
- డీసీవోల సిఫారసుతో కమిషనర్ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 27 సొసైటీలు ఉండొచ్చని అంచనా
- పొడిగింపు లేని సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం



హనుమకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) చైర్మన్లలో గుబులు పట్టుకుంది. ఆరు నెలల పాటు పాలకవర్గాల గడువు పెంపు చూసి మురిసి పోవాలో లేక తమకు అవకాశం దక్కుతుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు. గతంలో అవకతవకలు, అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్నవారు, వీటి విషయమై నోటీసులు అందుకున్న సొసైటీ చైర్మన్లు మరీ కలవరపడుతున్నారు. ఇలాంటి సొసైటీలు ఉమ్మడి జిల్లాలో సుమారు 27 వరకు ఉండవచ్చునని అంచనా.

పొడిగింపులో మెలిక

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 91 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటి పాలకవర్గాల గడువును పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇందులో ఒక తిరకాసు పెట్టింది. ఈ సంఘాల్లో ఏవైనా నష్టాల్లో ఉండటానికి పాలకవర్గం కారణమైనా, లేదా నిధుల దుర్వినియోగం ఆరోపణలు ఉన్నా ఆ చైర్మన్‌కు అవకాశమివ్వకూడదని ఉత్తర్వుల్లో ఉంది. దీంతో మరో ఆరు నెలలు కుర్చీలో కూర్చోవచ్చని ఆశపడ్డ చైర్మన్లలో కొందరికి ఇది ఆశానుపాతంలా తగిలింది. ఇదేం తిరకాసురా బాబు అని ఉస్సూరుమంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పీఏసీఎస్‌ల చైర్మన్లలో చాలా మంది బీఆర్ఎస్‌కు చెందినవారే. దీంతో తమకు మరికొన్నాళ్లు చైర్మన్లుగా ఉండే అవకాశం లేకపోవచ్చుననే నిర్ధారణకు వచ్చిన వారు అధికార పార్టీ నేతలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు చర్చ జరుగుతోంది.

సంఘాల పనితీరు, పారదర్శకత విషయంలో జిల్లా సహకార శాఖ అధికారులు (డీసీవో)కే నిర్ణయాధికారాన్ని ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల్లో సహకార శాఖ కమిషనర్

డీసీవోలదే తుది నిర్ణయం

జిల్లా డీసీవోలకు ఆ ఉత్తర్వులను పంపిస్తూ ఇబ్బందులు లేనివారికే చైర్మన్లుగా కొనసాగే అవకాశం కల్పించాలని సూచించారు. దీంతో ఆయా సంఘాల తీరుతెన్నులపై జిల్లా అధికారులు దృష్టి పెట్టారు.

అన్నీ సంఘాల ఆడిట్

సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏ పీఏసీఎస్‌లు నష్టాల్లో కూరుకుపోయి ఉన్నాయి? ఇందుకు చైర్మన్లు ఏ మేరకు బాధ్యులు? ఏ సంఘాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయి? ఇందులో చైర్మన్ బాధ్యత ఎంత? అనేది నిగ్గు తేల్చడానికి ఉమ్మడి జిల్లాలోని 91 పీఏసీఎస్‌ల్లో నాలుగైదు రోజులుగా ముమ్మరంగా ఆడిట్ జరుగుతోంది. ఒకటీ రెండు రోజుల్లో ఈ ఆడిట్ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం పాలకవర్గం పొడిగింపునకు అవకాశం లేని పీఏసీఎస్‌ల నివేదికలను సహకార శాఖ కమిషనర్‌కు పంపిస్తారు. వీటి పరిశీలన అనంతరం కమిషనర్ ఆదేశాల మేరకు అటువంటి పీఏసీఎస్‌ల చైర్మన్లు కొనసాగే అవకాశం ఇవ్వక వాటికి స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారు.

సుమారు 27 సంఘాలపై వేటు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 91 సంఘాల్లో దాదాపు 25 నుంచి 27 సంఘాలపైన వేటు పడే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లా 3 నుంచి 4, వరంగల్ జిల్లాలో 8 నుంచి 9, జనగామ జిల్లాలో 2 నుంచి 3 వరకు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1 లేదా 2, ములుగు జిల్లాలో 2 నుంచి 3, మహబూబాబాద్ జిల్లాలో 5 నుంచి 6 సంఘాలు ఉన్నట్లు అంచనా. వీటిపై గతంలోనే ఆరోపణలు వచ్చాయి. నిధుల దుర్వినియోగం జరిగిన సందర్భాల్లో కొందరిపై విచారణలు జరిపి, నోటీసులు ఇచ్చిన దాఖలు ఉన్నాయి. ఇందులో కొందరు తమ తప్పిదం లేదని న్యాయస్థానాలను ఆశ్రయించగా ఇంకొందరు విచారణ అనంతరం పక్కదారిపట్టిన సొమ్మును చెల్లించారు. ఇలాంటి సంఘాలు వాస్తవంగా ఎన్ని ఉన్నాయనేది మరో సారి ఆడిటలో బయట పడనున్నాయి. గడువు పొడిగింపునకు అర్హులు కానీ చైర్మన్ల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తారు. వారు పాలక వర్గ సభ్యులతో కార్యకలాపాలను కొనసాగించవచ్చు.

పీఏసీఎస్‌ల ఆడిట్ జరుగుతోంది..
సంజీవ రెడ్డి, జిల్లా సహకార అధికారి

సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 91 ప్రాథమిక సహకార పరపతి సంఘాల ఆడిట్ జరుగుతోంది. రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం చైర్మన్ల కాలపరిమితిని పొడిగించే అర్హత లేని సంఘాల జాబితాను కమిషనర్‌కు నివేదిస్తాం. కమిషనర్ ఆదేశాల మేరకు అటువంటి చైర్మన్లను తొలగించి వారి స్థానంలో ప్రత్యేకాధికారులను నియమిస్తాం. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పీఏసీఎస్‌లు కొన్ని ఉన్నాయి. అయితే అవి ఎన్ని అనేది ఆడిట్ పూర్తయితే గానీ స్పష్టం కాదు.



దర్గాలో పూజలు చేస్తున్న మంత్రి లక్ష్మణ్, ఎమ్మెల్యే నాయిని తదితరులు

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

- మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- కాజీపేటలో ముగిసిన దర్గా ఉత్సవాలు

కాజీపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక కాజీపేట దర్గా ఉత్సవాలని, ఈ వేడుకలకు రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రిగా హాజరు కావడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాజీపేట దర్గా ఉత్సవాలకు శనివారం హాజరైన మంత్రి లక్ష్మణ్‌కుమార్ దర్గాలోని బియాబాని సమాధిని దర్శించుకుని పూలు చల్లి, చాదర్ కప్పి మొక్కులు చెల్లించారు. మసీద్‌లో దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషాతో అంతర్గతంగా ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడారు. కాజీపేట దర్గాలో ముస్లిం నాయకులు కొన్ని సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని చెప్పారు. మంత్రి వెంట వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, కుస్రు పాషా తనయుడు భక్తియార్‌తోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మతపెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫకీర్ల విన్యాసాలు..

దర్గా ఉర్సు ఉత్సవాల్లో శనివారం మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్ల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి వేడి సీకులతో ఒంట్లో కుచ్చుకుని చేసే విన్యాసాలు ఒక వైపు, ఈ విన్యాసాలు జరుగుతుంటే మరో వైపు ఖవ్వాలి సన్నివేశాలతో దర్గా మార్మోగింది. సుమారు 20 మంది ఫకీర్లు రెండు గంటల సేపు నిర్వహించిన విన్యాసాలు చూడటానికి దర్గాను దర్శించుకున్న వారు పోటీ పడ్డారు. దర్గా ఉర్సు ఉత్సవం శనివారంతో ముగిసిందని దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా చెప్పారు. మొత్తంగా మూడు రోజుల ఉర్సు ఉత్సవాల్లో సుమారు 50వేల మందికి పైగా భక్తులు హాజరైనట్లు ముస్లిం నాయకులు పేర్కొన్నారు.



కవ్వాలి నిర్వహిస్తున్న ముస్లింలు

మేడారం జాతరలో ఆర్టీసీ బస్సులపై సమీక్ష

హనుమకొండ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మ 2026లో జరిగే మహా జాతరకు ఆర్టీసీ అధికారులతో కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్ శనివారం సమీక్ష నిర్వహించారు. వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు, ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ భవాని ప్రసాద్, ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం, ఇతర అధికారులతో జాతర నిర్వహణపై ఆర్టీసీ వరంగల్ రీజినల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గత జాతరలో ప్రయాణికుల ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్య తీరుపై సమీక్షలో చర్చించినట్లు తెలిపారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని కోరినట్లు తెలిపారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణం మహిళలకు వర్తిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్, అధికారులు రవీందర్, బీఆర్ సింగ్, భూపతి రెడ్డి, మధుసూదన్, ధరంసింగ్, రవిచంద్ర, అర్పిత, శివకుమార్, శ్రీరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితిలో జిల్లాకు సముచిత స్థానం

రెండోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

న్యూశాయంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా గాజులరామారంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో జరిగిన సీపీఐ రాష్ట్ర 4వ మహాసభల్లో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. ఈ మహాసభల్లో సీపీఐ రాష్ట్ర సహా య కార్యదర్శిగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు తిరిగి ఎన్నిక కాగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మండ సదాలక్ష్మి, ఆహ్వా నితులుగా తోట భిక్షపతిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



నేదునూరి జ్యోతి



కర్రె భిక్షపతి

ఎమ్మెల్యే కడియంపై మంత్రి సురేఖకు ఫిర్యాదు

సీనియర్లను పట్టించుకోవడం లేదని ఆవేదన



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ నాయకులు

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీనియర్లను కాదని, కొత్తగా వచ్చిన వ్యక్తులకు పెద్దపీట వేస్తున్నాడని ఆరోపిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ శ్రేణులు మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. హనుమకొండ రాంగనర్‌లోని ఆమె నివాసంలో సీనియర్లంతా మూకుమ్మడిగా కలిసి మంత్రి ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఇందిరమ్మ కమిటీలు, దేవాలయ కమిటీల్లో కొత్త వారిని అందలం ఎక్కిస్తూ సీనియర్లను అవమానిస్తున్నారని వివరించారు. అధికార కార్యక్రమాల సమాచారం సైతం సీనియర్ నాయకులకు చేరవేయడం లేదన్నారు. సింగపురం ఇందిరకు అండగా ఉన్నామనే కక్షతో కడియం ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నాడన్నారు. త్వరలోనే జరగబోయే స్థానిక ఎన్నికల్లో జెండాలు మోసిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రిని కోరారు. ఇన్ని రోజులు సహనంతో ఉన్నామని, ఇక నుంచి నియోజకవర్గంలో జరగబోయే పరిణామాలకు ఎమ్మెల్యే బాధ్యుడవుతాడన్నారు. స్పందించిన మంత్రి.. ఈ విషయాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ల దృష్టికి తీసుకెళ్లి సీనియర్లకు గౌరవం లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీది త్యాగాల చరిత్ర

మంత్రి ధనసరి సీతక్క

హనుమకొండ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి త్యాగాల చరిత్ర ఉన్నదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భోగాలు అనుభవించిన దొరల చరిత్ర కాదని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్టడీ సెంటర్‌ను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి థర్డ్ క్లాస్ అని మాట్లాడడం దొర అహంకారానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఎంతో మంది దేశం కోసం ప్రాణాలర్పించారని, ఎక్కడ కూడా రాజభోగాలు అనుభవించలేదని తెలిపారు. ప్రతిపక్షంలోనైనా, అధికారంలోనైనా ప్రజలతోనే ఉంటున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్ పాదయాత్రలు చేస్తున్నారని పేర్కొన్నారు.



స్టడీ సెంటర్‌లో నిర్వాహకులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

రేపే కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

- పదివేల మందితో యాత్ర జరిగేలా ప్లాన్
- 26 నాటి షెడ్యూల్ చివరి నిమిషంలో రద్దు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనహిత పాదయాత్ర వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో సోమవారం ప్రారంభం కానుంది. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ పాదయాత్రలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహరాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాల్గొంటారు. సోమవారం సాయంత్రం 5 గంటల సమ యంలో వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కనే పార్టీ జెండా ఎగురవేసి పాదయాత్రను ప్రారంభిస్తారు. ఇల్లంద సెంటర్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వేలాది మందితో దాదాపు 3 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేస్తూ వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంటారు. పదివేల మందితో పాదయాత్ర జరిగేలా ప్లాన్ చేస్తున్నారు.

అనంతరం అక్కడి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. ఈ మేరకు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర నియోజకవర్గాల నుంచి సైతం కాంగ్రెస్ శ్రేణులు తరలిరానున్నారు. పాదయాత్ర సందర్భంగా వర్ధన్నపేటకు ఇటు హైదరాబాద్ నుంచి పీసీసీ ముఖ్య నేతలు, ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు తరలిరానున్నారు. సభ ఏర్పాట్లు, పాదయాత్ర ప్లాన్, శ్రమదానం ఇతర కార్యక్రమాలను హైదరాబాద్ నుంచి వచ్చిన కాంగ్రెస్ నేతలు, నల్గొండ ఎమ్మెల్సీ శంకర్ నాయక్ చూస్తున్నారు. ఇన్‌చార్జిలుగా జూలూరి ధనలక్ష్మి, పులి అనిల్‌లు ఉండగా హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సైతం పలు సూచనలు చేశారు. పోలీసులు సైతం భారీగా మోహరించనున్నారు.



వర్ధన్నపేట మండలం ఇల్లందలో పాదయాత్ర చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

26 నాటి షెడ్యూల్ రద్దు..

వర్ధన్నపేట నియోజవర్గంలో రెండు రోజుల పాటు జనహిత పాదయాత్ర షెడ్యూల్ ఉండగా ఒక రోజే నిర్వహించి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. చివరి నిమిషంలో ఈ కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. కార్నర్ మీటింగ్ తర్వాత ఇక్కడే బస చేసి, తిరిగి ఉదయం వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జున స్వామి దర్శనం చేసుకుని పూజలు చేసి, జిల్లా స్థాయిల్లో, నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశ మవుతారని అనుకున్నప్పటికీ వాటిని రద్దు చేసుకు న్నారు. అత్యవసర మీటింగ్ ఉన్న కారణంగా కార్నర్ మీటింగ్ పూర్తవగానే జఫర్‌గఢ్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ పార్టీకి వర్ధన్నపేట అంటేనే వణుకు పుట్టేలా చేశామని, లక్ష ఓట్ల మెజార్టీ వచ్చిన అభ్యర్థిని తరమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నల్గొండ ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావు గుర్తు చేశారు. శనివారం మండలంలోని ఇల్లందలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగే జనహిత పాదయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఇల్లందలో జెండా ఎగురవేసే ప్రాంతాన్ని పరిశీలించి, వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో సభ నిర్వహించే స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జనహిత పాదయాత్ర, శ్రమదానం ఇన్‌చార్జిలు జూలూరి ధనలక్ష్మి, పులి అనిల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేఆర్ దిలీప్, నమిండ్ల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, కుల్ల యాకాంతం తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి ముందు కోడలి నిరసన

న్యాయం చేయాలని వినతి.. గురిజాలలో ఘటన

చెన్నారావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అత్తవారింటి ముందు కోడలు నిరసన వ్యక్తం చేసిన సంఘటన గురిజాల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహదేవపూర్ మండలం బొమ్మాపురం గ్రామానికి చెందిన ఓడేటీ యుగేంధర్‌రెడ్డి - ఈశ్వరిల కూతురు రాధికను వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన పోటు తిరుపతిరెడ్డి కుమారుడు రవికుమార్‌తో 2021 నవంబర్ 26న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.50 లక్షల కట్నంతో పాటు 80 గ్రాముల బంగారం ఇచ్చారు. నాలుగు నెలల పాటు ఇద్దరు అన్యోన్యంగా జీవించారు. ఏడాది తర్వాత కూతురు పుట్టింది. ఆ తర్వాత నుంచి భార్యాభర్తల మధ్య భేదాభిప్రాయాలతో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. భార్యాభర్తలు కలిసి ఉండాలని పెద్ద మనుషులు ఒక అగ్రిమెంట్ సైతం రాశారు. అయినప్పటికీ భార్యాభర్తల మధ్య సమస్య కొలిక్కి రాలేదు.

కాగా, శుక్రవారం సాయంత్రం రాధిక గురిజాల గ్రామానికి చేరుకుంది. అత్తగారి ఇంటి ఎదుట కూర్చొని తనభర్త కావాలంటూ తన రెండున్నర సంవత్సరాల పాపతో మౌన పోరాటానికి దిగింది. రాధిక తన కూతురుతో కలిసి రాగా అత్త, మామ, భర్త బయటికి నెట్టి వేసి ఇంటి గేటుకు తాళం వేసుకున్నారని తెలిపింది. గత రాత్రి నుంచి ఇంటి ముందు కూర్చున్నప్పటికీ భర్త, అత్త, మామలు రాధికను ఇంటి లోపలికి అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామస్థులకు తెలపడానికి కరపత్రాలను పంపిణీ చేసింది. తనను, తన కూతురును చేరదీసి తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకొంది.



గురిజాలలో అత్త ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రాధిక

ఎడ్లను పూజించి.. హారతి ఇచ్చి..

పొలాల అమావాస్య (పండుగ) వేడుకను రైతులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఎడ్లను పూజించి, మంగళ హారతి ఇచ్చారు. రైతులు తమ దుక్కిటెద్దులను ఉదయాన్నే పచ్చిక బయళ్లకు తీసుకెళ్లి కడుపునిండా మేపి, అనంతరం చెరువులు, కుంటలు, బోర్ల వద్ద వాటిని నీటితో కడిగారు. ఇళ్లకు తోలుకు వచ్చిన అనంతరం ఎడ్ల కొమ్ములకు రంగులు వేసి వాటి శరీరాలను సైతం పసుపు, కుంకుమల్లో ముంచిన చేతుల గుర్తులను వేసి మంగళహారతులిచ్చారు. గోమాతలకు ప్రత్యేకంగా పూజలు చేశారు. పాడి-పంటలు, గొడ్డు గోదా చల్లగా ఉండాలని కోరుతూ ప్రజలు పొలాల అమవాస్య రోజున ఎద్దులకు, ఆవులకు రంగులు వేసి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంతో శనివారం కనిపించిన దృశ్యమిది.



-ఆంధ్రజ్యోతి, కాటారం

నడిచొచ్చిన గోపికా కృష్ణులు..

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని జనగామ జిల్లా బచ్చన్నపేటలో వందలాది మంది భక్తులు, చిన్నారుల మధ్య శనివారం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి, హిందూ జ్ఞానవేదిక జనగామ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ శ్రేష్ఠి, ఉత్సవ నిర్వాహకుడు ఉపేందర్ మాట్లాడుతూ ఈ ప్రపంచమంతా ఓశక్తిపై ఆధారపడి ఉన్నదని, ఆ శక్తియే మానవజన్మ రూపంలో వచ్చిన శ్రీకృష్ణుడిదన్నారు. ఊరేగింపు సందర్భంగా దేవుడి విగ్రహం తమ ఇంటి ముందుకు రాగానే ప్రజలు నీళ్ల పోస్తూ, టెంకాయలు కొడుతూ భక్తి భావం చాటుకున్నారు. కట్కూరు శివరామకృష్ణ భజన మండలి ఆలపించిన పాటలు ఉర్రూతలూగించాయి. కోలాటాలు, చిన్నారులతో కృష్ణుడు, గోపికల వేషధారణలు, పేరిణి నృత్యాలు అలరించాయి. - ఆంధ్రజ్యోతి, బచ్చన్నపేట



తాగునీటిలో గడ్డిమందు

- భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఓ ఉపాధ్యాయుడి నిర్వాకం
- ఆ నీటిని తాగిన 11 మంది విద్యార్థులకు అస్వస్థత
- ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు కుట్ర జరిగినట్టు విచారణలో వెల్లడి
- ఎమ్మెల్యే ఎదుట తమ గోడు వినిపించిన విద్యార్థులు
- విధుల నుంచి నలుగురిని తొలగించిన కలెక్టర్

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారి మధ్య ఉన్న విభేదాలు విద్యార్థులకు శాపంగా మారింది. ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు ఓ ఉపాధ్యాయుడు హాస్టల్‌లో విద్యార్థులు వినియోగించే నీళ్లల్లో విషం కలపడం కలకలం రేపుతోంది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకోగా 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీనిపై శనివారం విచారణ జరగ్గా విస్తుబోయే పలు విషయాలు వెల్లడయ్యాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ నడుస్తోంది. ఇందులో 30 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇందులో ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అల్పాహారం చేసిన తర్వాత 11 మంది విదార్థులు నీటిని తాగి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. అయితే.. విద్యార్థులు తాగే నీటిలో పాఠశాలలో విధులు నిర్వర్తించే ఓ ఉపాధ్యాయుడే గడ్డి మందు కలిపినట్టు తేలింది. మందు కలిపిన సీసా కూడా తమ గదిలో దొరికినట్టు విద్యార్థులు తెలిపారు. ఈ ఘటనకు ఓ ఉపాధ్యాయుడు, ప్రత్యేక అధికారి మధ్య ఉన్న గొడవే కారణమని విద్యార్థులు అంటున్నారు.

ప్రత్యేక అధికారిని ఇరికించేందుకు ఆ ఉపాధ్యాయుడు నీళ్లల్లో గడ్డి మందు కలిపాడని ఆరోపిస్తున్నారు. గడ్డి మందు నీళ్లల్లో కలిపిన ఆ ఉపాధ్యాయుడు తమ దుప్పట్లపై కూడా దాన్ని చల్లి ఆ నెపాన్ని తమపై నెట్టేయడానికి గడ్డిమందు వాసన వచ్చేలా తమ దుప్పట్లపై దాన్ని చల్లాడని అంటున్నారు. శనివారం ఉదయం హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఎస్పీ సంపత్‌రావుకు ఈవిషయాలను విద్యార్థులు వెల్లడించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఎస్‌వో, మరో ముగ్గురు ఉపాధ్యాయులకు తరచుగా గొడవలు జరుగుతున్నాయని విద్యార్థులు తెలిపారు. ముగ్గురు ఉపాధ్యాయులు తరచూ తమను తరచూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నలుగురి విధుల నుంచి తొలగించిన కలెక్టర్

కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖారే హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఘటనపై విచారణ చేపట్టారు. దీనికి కారణమైన ఉపాధ్యాయుడు రాజేందర్‌తో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు వేణు, సూర్యప్రకాశ్, వంట కార్మికురాలు రాజేశ్వరిని విధుల నుంచి తొలగిస్తున్నట్టు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

కొర్కిశాల కేజీవీబీలో ఇద్దరి తొలగింపు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల కేజీవీబీ ఆశ్రమ పాఠశాలలో ఆహారం కలుషితం కావడంపై కలెక్టర్ రాహుల్‌శర్మ చర్య తీసుకున్నారు. ఇప్పటికే హాస్టల్‌లోని వంట మనుషులను తొలగించిన ఆయన శనివారం పాఠశాల ఎస్‌వో శైలజ, పీఈటీ శ్రావణిపై వేటు వేశారు. ఇద్దరిని విధుల నుంచి తొలగిస్తున్నట్టు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని భక్తులు భారీ సంఖ్యలో శనివారం దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల తరలివచ్చి దైవ దర్శనాలు చేసుకున్నారు. ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, విశ్రాంతి అర్చకుడు కైంకైర్యం రాఘావాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ఈశ్వర్‌చంద్‌శర్మ, పవన్‌క ుమారాచార్యులు, అనిపెద్ది మురళీకృష్ణశర్మ, వెంకటనా రాయణశర్మ స్వామివారి మూలవిరాట్టుకు తిలా, తైలాభి షేకం చేసి దర్శనాలు గావించారు.





హేమాచల క్షేత్రంలో భక్తులు, మాజీ డీజీపీ దంపతులు

దర్శించుకున్న మాజీ డీజీపీ దంపతులు

లక్ష్మీనరసింహ స్వామిని రాష్ట్ర మాజీ డీజీపీ గోపీనాథ్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. పూజారులు, అధికారులు ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసిన గోపీనాథ్‌రెడ్డి దంపతులను ఆలయ ఈవో ఆర్. మహేష్, దేవస్థానం మాజీ చైర్మన్ యర్రంకాని సురేష్ స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, మంగపేట, ఎస్సై సూరి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నినదించిన ఉద్యోగ సంఘాలు

గణపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని అముల చేయాలని, అప్పటి వరకు తమ పోరాటం ఆగదని టీఎస్‌సీపీఎస్ఈ యూ జిల్లా అధ్యక్షుడు దిల్షాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. మధ్యాహ్న భోజన సమయంలో ప్రధాన రహదారిపై నల్ల బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేశారు. కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఉప్పలయ్య, పశు వైద్యాధికారి శ్రీకాంత్, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది, పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శనివారం భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం అనంతరం తహసీల్దార్ ఇమామ్ బాబాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యుడు శ్రీరాం రఘుపతి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కానుగుల రఘుపతి, గోపగాని భాస్కర్, సంఘం సభ్యులు సతీష్, బుర్ర సదయ్య, మనోహర్, మహేందర్, మధు, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉపాధ్యాయులకు పదోన్నతుల విషయంలో అడక్వేసి సవరణ చేసి ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్‌ను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం సమయంలో నిరసనలు తెలిపారు. ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాపర్ చోరీ

కాటారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు పగులకొట్టి కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ ఉపేందర్ శనివారం పరిశీలించార. ఐడిల్‌గా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మూతను పగులగొట్టిన దొంగలు అందులోని విలువైన రాగి తీగను ఎత్తుకెళ్లారని ట్రాన్స్‌కో ఏఈ ఉపేందర్ వెల్లడించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కాంక్షించారు. పట్టణంలోని జయశంకర్ చౌరస్తాలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం క్రీడా దినోత్సవ రన్‌ను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా శారీరక దారుఢ్యం, ఆరోగ్య కర జీవనశైలికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ ర్యాలీ జయశంకర్ చౌరస్తా నుంచి అంబేద్కర్ క్రీడామైదానం వరకు కొనసాగింది. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, విజయలక్ష్మి, క్రీడల అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

గణపురం (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని బుద్దారం గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఏ ఒక్కరికీ ఇల్లు ఇవ్వకుండా తాత్సారం చేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ రేపాక రాజేందర్, అశోక్, కట్కూరి శ్రీనివాస్, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటంచ ఆలయ నిర్మాణం పరిశీలన

రేగొండ (ఆంధ్రజ్యోతి) : కోటంచ లక్ష్మీనరసింహసామి ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ గర్భగుడి, పరిసరాల్లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు తగిన సూచనలు చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, కోటంచ చైర్మన్ భిక్షపతి, నాయకులు ఎర్రబెల్లి రవిందర్‌రావు, లింగపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో క్రీడా ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

బొమ్మాపూర్‌లో గేదెలకు వింత వ్యాధి

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు ఐదు గేదెలకు వింత వ్యాధి సోకినట్లు పలువురు రైతులు తెలిపారు. కొద్ది రోజులుగా గ్రామానికి చెందిన గేదెలు విచిత్రంగా వ్యవహరిస్తున్నాయని, పాలు పితికేందుకు వెళ్తే పొడుస్తున్నాయని అన్నారు. తోటి గేదెలను సైతం దగ్గరకు రానివ్వడం లేదని చెబుతున్నారు. ఈవిషయమై స్థానిక పశువైద్యుడిని సంప్రదించగా గేదెలు పిచ్చి కుక్కకాటుకు గురై ఉంటాయని అన్నారు. కుక్కకాటును గుర్తించకపోవడంతో వాటిలో వింత ప్రవర్తన మొదలైనట్లు తెలిపారు. కాగా పిచ్చికుక్క కాటును సకాలంలో గుర్తించలేనందున ఆ గేదెల పరిస్థితి విషమించినట్లు చెప్పారు.

నిధుల మంజూరుపై హర్షం

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : పలిమెల మండల నూతన ఎంపీడీవో కార్యాలయానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు పలిమెల మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దండేరా రాజేందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

కృష్ణకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. భూపాలపల్లి పట్టణ పరిధిలోని జవహర్‌నగర్‌కాలనీకి చెందిన దేవేంద్ర మునిపల్ కార్యాలయంలో పంప్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అంబేద్కర్ సెంటర్ నుంచి మునిసిపల్ కార్యాలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. దీంతో దేవేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతడు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళులు

కృష్ణకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై స్థానిక సీపీఐ, వామపక్ష నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో శనివారం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురిజెపల్లి సుధాకర్‌రెడ్డి సోత్కు ప్రవీణ్‌కుమార్, మాతంగి రాంచందర్, క్యాతరాజు సతీష్, తదితరుల పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలపై పోలీసుల దాడులు

కాటారం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న నాలుగు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. గారెపల్లి, దేవరాంపల్లిలో తనిఖీలు నిర్వహించి రూ.3.02 లక్షల విలువైన గుట్కాలు, అంబర్ ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

'జనహిత యాత్ర'ను సక్సెస్ చేయాలి..

(5వ పేజీ తరువాయి)


రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని మంత్రి లక్ష్మణ్ చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్రను జయప్రదం చేయడంలో సమష్టిగా పని చేయాలని సూచించారు.

కాగా, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలతో డీసీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ జనహిత పాదయాత్ర విజయవంతం కోసం దిశా, నిర్దేశం చేశారు. గంటన్నరకు పైగా సమీక్ష జరిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు తరలింపు, రవాణా సౌకర్యాలు, నాయకుల బాధ్యతలు తదితర అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. అందరు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, నమిండ్ల శ్రీనివాస్, ధర్మారావు, ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, దుద్దిళ్ల శ్రీనుబాబు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

షైన్ స్కూల్‌లో పర్యావరణ పరిరక్షణ వేడుకలు

కృష్ణకాలనీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని షైన్ హైస్కూల్‌లో పర్యావరణ పరిరక్షణ వేడుకలను పాఠశాల యాజ మాన్యం శనివారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి పరి రక్షణ బాధ్యతలను తీసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భానుచందర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం బాధ్యతగా భావించి మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలోవిద్యార్థులు గ్రీన్ కలర్ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ స్రవంతి, ఇన్‌చార్జి రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

తహసీల్దార్లకు బీజేపీ నేతల వినతి

ఏటూరునాగారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ జగదీశ్వర్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు సరి కొండ బలరాం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత, రాష్ట్ర కౌన్సిలర్ భూక్య జవహర్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకుల కృష్ణకరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇక మహాలక్ష్మి పాల్గొన్నారు.

• కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండల పరిధిలో నెలకొని ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నేతలు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టి డీటీకి వినతి పత్రాన్ని అందించారు. భట్టు రవి, కంబాల రాజయ్య, ఊరటి మునేందర్, జంజర్ల సురేష్, కంచం నరసింహా మూర్తి, తుమ్మేటి దామోదర్‌రెడ్డి, రవిరాజా, బానాల మధుకర్, నల్లా సుకేందర్‌రెడ్డి, తాండ్ర హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

• వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం



ఏటూరునాగారంలో వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

ఎన్నికలకుముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్, నాయకులు ఉప్పల కృష్ణమూర్తి, జల్లిగంపల లక్ష్మీపతి, తుమ్మ సర్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ బాబుకు మండల అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పార్టీ ములుగు జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు మార్క సతీష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరి కొండ బలరాం, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, భూక్య జవహర్‌లాల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్, కొత్త సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్ రావు

ములుగురూరల్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): క్షయ (టీబీ) రహిత జిల్లాగా ములుగును తీర్చిదిద్దాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో టీబీ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 60 ఏళ్ల పైబడిన వారు, మధుమేహం వ్యాధిగ్రస్థులు, మద్యం సేవించే వారు, పొగతాగే వారు, హెచ్‌ఐవీ, క్యాన్సర్ ఉన్న వారికి టీబీ వచ్చే అవకాశం ఎక్కువ ఉందన్నారు. తప్పనిసరి వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ నియంత్రణ ప్రోగ్రాం అధికారి చంద్రకాంత్, జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి పవన్ కుమార్, జిల్లా టీబీ నియంత్రణ కోఆర్డినేటర్ సమ్మయ్య, సూపర్‌వైజర్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌రెడ్డి మరణం తీరని లోటు

నివాళులు అర్పించిన వామపక్ష, ప్రజా సంఘాలు

ములుగుటౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటని వామపక్ష నాయకులు అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు సుధాకర్‌రెడ్డి ఆధ్యుడని, బలహీన వర్గాల అభ్యున్నతికి జాతీయ స్థాయిలో పోరాడిన ఘనత ఆయనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపల రవీందర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రత్న రాజేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మారటి రవీందర్, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, మాతంగి శ్యాంసుందర్, రత్నం దామోదర్, చెన్న వీరస్వామి పాల్గొన్నారు.

ఇసుక లారీలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి : సీపీఎం

ఏటూరునాగారం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలు రోడ్లపై నిలపకుండా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బి. సాంబశివ డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ నాయకులతో కలిసి ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయకు శనివారం వినతిపత్రం అందించారు. మంగపేట, వెంకటాపురం, ఏటూరునాగారం, వాజేడు మండలాల్లో ఇసుక రీచ్‌ల నిర్వహణ వల్ల రోడ్లు గుంతలమయంగా మారడంతో పాటు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు గ్యానం వాసు, ఎమ్డీ. దావూద్, కొప్పుల రఘుపతి పాల్గొన్నారు.

రబీ సీజన్ బోనస్ డబ్బులు అందించాలి

గోవిందరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి బోనస్ డబ్బులు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గుండు రామస్వామి అధ్యక్షతన శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెబుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండునెలలైనా రబీసీజన్ బోనస్ డబ్బులు నేటివరకు చెల్లించక పోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎలాంటి తాత్సారం చేయకుండా బోనస్ డబ్బులను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు గొంది రాజేష్, తీగల ఆగిరెడ్డి, కడారి నాగరాజు, కొటి కృష్ణారావు, క్యాతం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

వెంకటాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గణేష్ మండపాలు ఏర్పాటుచేసే వారు ఆన్‌లైన్‌లో పోలీస్‌శాఖ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాల ఎస్సై చల్ల రాజు అన్నారు. శనివారం ఆయన పలు గ్రామాల్లో మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మండపం వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా నాణ్యమైన విద్యుత్ తీగలను మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. మండపం వివరాలు, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు మండపం వద్ద కనిపించేలా ప్రదర్శించాలని, స్థానిక పోలీస్‌స్టేషన్, పోలీస్ అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. మండపాల వద్ద అధిక శబ్దం చేసే సౌండ్‌సిస్టంలను ఎట్టిపరిస్థితుల్లో వినియోగించరాదని, 24 గంటలపాటు మండపం వద్ద ఒక వలంటీర్ ఉండాలని, అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఇసుక బకెట్లు, నీరు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఏదైనా అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్‌రూంకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

ట్రాక్టర్ బోల్తాపడి కూలీలకు గాయాలు

మంగపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు ట్రాక్టర్ బోల్తాపడి గాయాలపాలైన సంఘటన మండలంలోని శనిగకుంట రోడ్డుపై శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నర్సింహసాగర్ నుంచి కూలీలతో వ్యవసాయ పనులకు వెళ్తున్న ట్రాక్టర్ బయల్దేరగా శనిగకుంట రోడ్డు వద్ద బోల్తాపడింది. దీంతో దోసిల్ల మీన, కడారి రజిత, గడ్డి కమలమ్మ, సొప్పరి వీరమ్మ, శీల మమత, బెల్లి స్వరూప, చిట్టి పోతుల సత్తెమ్మ, పోగు జగ్గమ్మ, పోగు రజనీ, పానుగంటి ఉప్పలమ్మతో పాటు మరో 12 మందికి గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా క్షత గాత్రులను ఏటూరునాగారం సామాజికవైద్యశాలకు తరలించారు. గాయపడ్డ వారికి ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని సర్కారు

బీఆర్ఎస్ నేతలు లక్ష్మణ్‌బాబు, నాగజ్యోతి

మంగపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు (లక్ష్మణ్‌బాబు), నియోజకవర్గ ఇన్‌చార్జి బడె నాగజ్యోతి విమర్శించారు. మండలంలోని మల్లూరు వద్ద బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేశారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌రావు, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి బాడిశ నాగరమేష్, బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు కొమరవ ధనలక్ష్మి, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, ఏటూరునాగారం పీఏసీఎస్ చైర్మన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.